చదును చేస్తారు.. ఆక్రమిస్తారు

అంబాట్‌పల్లిలోని గుట్ట వద్ద ఇలా

నిఘా

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న కొందరు పట్టాదారులు క్రమంగా హద్దులు దాటి భూములను చదును చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ గుట్టల్లోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే.. ఆ తర్వాత అదే ప్రాంతాన్ని ఇంకొందరు చదును చేసి క్రమంగా సాగుభూమిగా మార్చేస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు..: లింగాల మండలంలోని అంబటిపల్లి గ్రామంలోని సర్వేనం 471లో 6.36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేసి సాగుకు సిద్ధపడ్డారని పంచాయతీ తరపున ఉప సర్పంచి సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు.

ఇలాంటివి కొన్ని, ఇలా...! : కోడేరులోని ఊరగుట్టను మూడు ఎకరాల వరకు తవ్వేసి చుట్టూ మామిడితోటను పెంచుతున్నారు. పసుపుల నడింగట్టు శివారున రెండెకరాల వరకు సాగు చేస్తున్నారు. కొల్లాపూర్ నుంచి సోమశిల వెళ్లే దారిలో గుట్టలు, అటవీ భూమిని చదును చేస్తున్నారు. బావాయిపల్లి శివారులోని ఎల్లమ్మతిప్ప వద్ద ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోంది. తెలకపల్లి, రఘుపతిపేటకు సమీపంలోని రామగిరిగుట్ట మట్టిని నిత్యం తరలించేస్తున్నారు. ఆక్కడ చదును చేసిన ప్రాంతంలో క్రమంగా కొందరు వ్యక్తులు సాగులోకి తీసుకువస్తున్నారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమంగా చదును చేస్తున్నారు. అటవీ భూములకు ఆనుకుని చెట్లను తొలగిస్తూ ఎకరాలను సాగులోకి తెస్తున్నారు.

ఆర్ఐతో విచారణ: అంబాట్‌పల్లి శివారులోని సర్వేనం. 471లో ప్రభుత్వ భూమి ఉంది. ఆక్రమణ విషయమై ఆర్ఐతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్, తహసీల్దార్, లింగాల

చిన్నారులకు 24 గంటలు అందుబాటులో ఉండాలి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: బాలసదనంలో చిన్నారులకు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బాల సదనం, వృద్ధాశ్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వయోవృద్ధుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాల సదనం, వృద్ధాశ్రమంలో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారికి వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలన్నారు. నిత్యం తాజా కూరగాయలు కొనుగోలు చేయాలన్నారు. గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల సదనం, వృద్ధాశ్రమంలో దస్త్రాలు, హాజరు పట్టికలు పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్‌కుమార్

వైభవంగా మహారథోత్సవం

నారాయణపేట, న్యూస్‌టుడే: పేట పరిమళపురంలోని శ్రీరాఘవేంద్రస్వామివారి మహారథోత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. జోషి రఘుప్రేమ్ ధార్మిక ప్రవచనం చేస్తూ శ్రీరాఘవేంద్రస్వామిని కొలిచిన వారికి కల్పతరువుగా సకల కోరికలు తీరుస్తారన్నారు. స్వామివారి సేవలో ప్రతి ఒక్కరూ తరలించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నర్సింహాచారి, విద్వాన్ అనిల్ దేశాయి, అజలపూర్ రాఘవేంద్ర, రఘుప్రేమ్, సేవా సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

4న మద్దూరుకు ముఖ్యమంత్రి రాక

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 4న మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వంచర్ల బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూరులో నిర్మిస్తున్న గురుకుల, డిగ్రీ కళాశాల భవనాలు, రోడ్ల వెడల్పు పనులు పరిశీలిస్తారన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ పర్యటిస్తారన్నారు. బొంరాస్‌పేట మండలం పోలేపల్లిలో కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.

రైతు వేదికలకు సౌర వెలుగులు

భవనాల పరిస్థితిపై నివేదిక కోరిన ప్రభుత్వం

అయిజ, న్యూస్‌టుడే: రైతు వేదికలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సౌర పలకల ఏర్పాటుకు అనుమతించింది. వీటిని అమర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘాని (హాకా)కి బాధ్యతలు అప్పగించింది. జిల్లాల వారీగా రైతు వేదికల పరిస్థితిపై నివేదిక అందజేయాలని ప్రభుత్వం కోరింది. జిల్లా వ్యవసాయాధికారులు నివేదిక తయారీలో నిమగ్నమయ్యారు.

నిర్వహణ లోపంతో.. : ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చాలా రైతు వేదికలు అధ్వానంగా మారాయి. తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. మెట్లు, ర్యాంపులు పగుళ్లిచ్చాయి. కొన్నిచోట్ల ముళ్ల చెట్లు పెరిగాయి. నిర్వహణకు నిధులను మంజూరు కాకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 472..: గత ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో వేదికను రూ.22 లక్షలతో నిర్మించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 472 రైతు వేదికల నిర్మాణాలకు రూ.103.84 కోట్లు వెచ్చించారు.

రైతు వేదికలు	
గద్వాల	94
మహబూబ్‌నగర్	88
నాగర్‌కర్నూల్	142
నారాయణపేట	77
వనపర్తి	71

రక్షణ లేక చోరీలు : వేదికలకు రక్షణ లేకపోవడంతో రాత్రిళ్లు చోరీలు జరుగుతున్నాయి. చాలా చోట్ల ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాటరీలు, విలువైన వస్తువులు తదితరాలు చోరీ చేశారు. దొంగతనాలను అరికట్టడానికి ఇప్పటికైనా సౌర విద్యుత్తు కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

అయిజ రైతు వేదిక ర్యాంపునకు పగుళ్లు

నీటి వసతి కరవై: కనీసం నీటి వసతి కూడా లేకపోవడంతో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశాలకు కుర్చీలు వేసేందుకు స్వీపర్లు లేరు. అన్నీ ఏఈవోలే చూసుకుంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఇతర ఖర్చులను అధికారులే భరిస్తున్నారు.

బంతిని తోస్తే గోల్‌లో పడాల్సిందే

ధన్వాడ, న్యూస్‌టుడే: ధన్వాడ మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకులానికి చెందిన విద్యార్థులు ఫుట్‌బాల్‌లో రాణిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సుబ్రతో ముఖర్జీ కప్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 15న దిల్లీలో జరగనున్నాయి. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' క్రీడాకారులను పలకరించగా వెలుబుచ్చిన అభిప్రాయాలిలా ఉన్నాయి.

నా పేరు **ఎం.సిద్ధు.** కొండాపూర్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. నాకు చిన్నప్పటి నుంచి ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం. గురుకులంలో ప్రవేశం పొందిన తర్వాత ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తుండటంతో ఇష్టంగా ప్రవేశం పొంది నేర్చుకుంటున్నా. గతంలో పలుమార్లు జిల్లా జట్టు తరపున హాజరయ్యా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో నారాయణపేట జట్టు తరపున పాల్గొని బంగారు పతకం సాధించడం జరిగింది. భవిష్యత్తులో ఆర్మీ ఉద్యోగం సాధించి ఇండియా తరపున గోల్ కీపర్‌గా ఎంపిక కావాలన్నదే లక్ష్యం.

నా పేరు **ముడావత్ అరుణ్** కొండాపూర్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. అమ్మానాన్నలు తారమ్మ తోక్యా వ్యవసాయ కూలీలు. బయట చదివించలేక గురుకులంలో చేర్పించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయులు తరచూ చెప్పే మాటలకు ప్రేరణ పొంది ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేపట్టా. కోచ్ రామ్మోహన్‌గౌడ్ ప్రోత్సాహంతో మంచి ప్రావీణ్యం సాధించా. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. భవిష్యత్తులో ఫుట్‌బాల్ కోచ్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

నా పేరు **కాట్రావత్ మహేష్.** గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. పలు సందర్భాల్లో ఐఏఎస్‌లకు లభిస్తున్న గౌరవాన్ని చూశా. ఆ స్థాయికి నేనెందుకు చేరుకోకూడదన్న ప్రశ్న ఉదయించింది. దీని సాధన కోసం చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నిశ్చయించుకొని ఫుట్‌బాల్ సాధన చేస్తున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ముందు క్రీడా కోటల్లో ఏదేని ఉద్యోగం సాధించి దీని ద్వారా ఐఏఎస్ సాధించాలనుకుంటున్నా.

నా పేరు **దేగావత్ సచిన్.** తల్లిదండ్రులు మిర్యాభాయి, డేగ్యా. చదువురాదు. తమలా కారాదన్న ఉద్దేశంతో నన్ను గురుకులంలో చేర్పించారు. నాకు వ్యవసాయం అంటే మక్కువ. వ్యవసాయ శాఖలోనే మంచి ఉద్యోగం సాధించి రైతులకు తోడ్పడాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం ఫుట్‌బాల్‌లో రాణిస్తున్నా. ఇందులో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు సాధిస్తా.

రూ.108 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

- 2027లో గద్వాల స్టేషన్ శతాబ్ది ఉత్సవాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల: మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల కలెక్టరేట్, అలంపూర్, శాంతినగర్, న్యూస్‌టుడే: వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2027 ఏప్రిల్‌లో నిర్వహిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్‌లో రూ.108 కోట్లు వ్యయం చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల రెండో రైల్వే గేటు వద్ద రూ.66 కోట్లతో మరో ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూలేనివిధంగా తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.886 కోట్లు మంజూరు చేస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తెలంగాణలో రైల్వేలకు రూ.5,454 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది 118 ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంలో భాగంగానే గద్వాలకూ మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వందేభారత్ గద్వాల స్టేషన్‌లో ఆల్ట్‌కు పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరారు. డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల పుర ఛైర్‌పర్సన్ జయలక్ష్మి పాల్గొన్నారు. ● అలంపూర్ హరిత టూరిజం వద్ద ఆర్డీఎస్, తుంగభద్ర డ్యామ్ నుంచి నీటి విడుదలలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణకు సోమవారం రైతులు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధం.. నల్లమల సురక్షితం

ఏటీఆర్‌లో వ్యర్థాల రీసైక్లింగ్

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ భూతం నుంచి నల్లమలలోని వన్యప్రాణులు, అడవి నేల, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. మన్ననూరు చెక్‌పోస్టు వద్ద భక్తులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ నీటి సీసాలు, కవర్లను సేకరించి అడవిలో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. సేకరించిన వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ సెంటర్‌కు తరలించి బెయిళ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

మన్ననూరులో బెయిలింగ్ యంత్రంలో ప్లాస్టిక్ సీసాలను వేస్తున్న సిబ్బంది

వన్యప్రాణులకు ముప్పు: ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలను అడవిలో పడేయడంతో వన్యప్రాణులు, నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తిన్న వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉంది. నేల, నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది.

చెక్‌పోస్టు వద్దే అడ్డుకట్ట: నల్లమల గుండా ప్రముఖ పుణ్యక్షేత్రాలు శ్రీశైలం, మద్దిమడుగుకు నిత్యం వందలాది వాహనాలు అటవీ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. భక్తులు ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తీసుకెళ్తుంటారు. అడవిలోకి ప్రవేశించే ముందే వాటిని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది సేకరిస్తున్నారు. లీటరు, అంతకన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ నీటి సీసాల విక్రయాన్ని నల్లమలలో నిషేధించారు. పర్యాటకులు పడేసే ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించేందుకు 16 మందిని వాచర్లను నియమించారు. వీరు నిత్యం సుమారు 5 సంచుల చెత్త, నీటి సీసాలను సేకరించి బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తున్నారు.

బెయిలింగ్ తరలింపు

సేకరించిన చెత్త, సీసాలను ప్రత్యేక వాహనం ద్వారా మన్ననూరు బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తారు. కొంత మొత్తం పోగైన తర్వాత వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు విక్రయిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో ఒక్కొక్కటి సుమారు 30 కిలోల బరువుండే 345 ప్లాస్టిక్ సీసాల బెయిళ్లను విక్రయించారు. ఒక్కో కిలో రూ.10 చొప్పున అమ్మారంటే అతిశయోక్తికాదు.

నీట్‌కు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: నీట్‌కు ఇప్పటి నుంచే ప్రణాళికతో సిద్ధం కావాలని, ప్రతిరోజు కొంత సమయం కేటాయించి చదువుతో పాటు పునశ్చరణ, మాక్ టెస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రియాంక విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఇంటర్ అనంతరం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టపడి పని చేయాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

ఓటు వేసేందుకు కాదు.. సర్

సహజంగా పోలింగ్ రోజు ఓటు వేసేందుకు బారులు తీరుతుంటారు. కానీ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ధ్రువపత్రాలు సమర్పించేందుకు బారులు తీరిన దృశ్యం ఊట్కూరు మండలకేంద్రంలో సోమవారం కనిపించింది. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో పావని పర్యవేక్షించారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, ఊట్కూరు

గంజాయి ముప్పు.. కానరాదు తప్పు

- హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం ఆరు కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీ మొత్తంలో పోలీసులకు సరకు దొరకడం ఉమ్మడి జిల్లాలోనే ఇదే మొదటిసారి.

మహబూబ్‌నగర్‌లో ఐదు గ్రాముల ఎండు గంజాయిని ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారు. కొందరు యువకులు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి వాటిని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి అమ్ముతున్నారు. సులువుగా అడ్డదారిలో డబ్బు సంపాదించాలని పలువురు ఈ దందా సాగిస్తున్నారు.

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అరకొరగా ఉంటూ, గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న దందా ఇప్పుడు బహిరంగంగానే ఆయా ప్రాంతాల్లో నడుస్తోంది. మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న భవనాల్లో కొందరు విద్యార్థులు గంజాయి మత్తులో మునుగుతున్నారు. గంజాయిని విక్రయించేవారు అక్కడికి వచ్చి విద్యార్థులకు అందిస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్, కర్నూలు, నల్లమల అటవీ ప్రాంతం, రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి అక్రమార్కులు సరకు దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని 5 గ్రాముల ప్యాకెట్లుగా చేసి రూ.400-600కు విక్రయిస్తున్నారు. ఇందులో ఆటో డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

● మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోట, పెబ్బేరు, అలంపూర్, గద్వాల, నారాయణపేట, మక్తల్, మరికల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో సులువుగా గంజాయి ప్యాకెట్లను యువతకు విక్రయిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది కళ్లు గప్పి వాటిని విక్రయించడం గమనార్హం.

మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక కేసులు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ గంజాయి విక్రయాలు, వినియోగంలో మహబూబ్‌నగర్ జిల్లా ముందంజలో ఉంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 27 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్‌లో 21 నమోదయ్యాయి. ఇక్కడ ఏ మేరకు గంజాయి వాడకం ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి.

● నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రెండేసి చొప్పున, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 16 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 13 ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో రెండు, జోగులాంబ గద్వాల జిల్లాలో ఒకటి చొప్పున కేసులను పోలీసులు నమోదు చేశారు.

నియంత్రణకు కృషి: ఉమ్మడి జిల్లాలో గంజాయి కేసుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. పలు ప్రాంతాల్లో నిఘా పెట్టి తనిఖీలు చేస్తున్నారు. గంజాయిని నిర్మూలించడానికి మారుమూల ప్రాంతాల్లోనూ తనిఖీలు చేస్తున్నాం.

- విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్లు గడువులోపు నమోదు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో డీఈవో మాట్లాడారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీ వరకు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాల యూజర్ ఐడీ పాస్‌వర్డు నమోదు చేసుకొని 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోచ్చన్నారు. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సమయంలో విద్యార్థి బ్యాంకు ఖాతా, ఆధార్ నమోదు చేయాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టును క్లుప్తంగా నమోదు చేయాలని వివరించారు. ఈ అవార్డులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయన్నారు. ఎంపికైన అవార్డుకు విద్యార్థి ఖాతాకు రూ.పది వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. www.inspireawards-dst.govt.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

రైతేరాజు 6లో..

వెలిగొండ పేరిట జలచౌర్యం అడ్డుకోని సీఎం: భారాస

ప్రాజెక్టుల వివరాలను తెలియజేస్తున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా కృష్ణా జలాలను దోపిడీ చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం భారాస జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరరెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా గురించి వివరించారు.

● నాడు మద్రాస్ రాష్ట్రానికి తాగునీరు సరఫరా చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు త్యాగం చేయడంతో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పక్కన తూము ద్వారా 15 టీఎంసీల నీటిని తెలుగు గంగ కాల్వల ద్వారా తరలించారని పేర్కొన్నారు. మద్రాసుకు 4 నుంచి 5 టీఎంసీల నీరు మాత్రమే ఇవ్వగా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలో సాగునీటి అవసరాలకు రెండు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు.

● అసలు వరద జలాలను మాత్రమే తరలించాలని నియమం ఉండగా ఎలాంటి వరదలేని సమయంలో ఎలా తరలిస్తారని ప్రశ్నించారు.

● తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తాము అధికారం చేపట్టిన అనంతరం కేఎల్ఐ కోసం రూ.800 కోట్లు ఖర్చు చేశామని, పాలమూరు-రంగారెడ్డికి నిధులు కేటాయించి సుమారు 85 శాతం పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పనులు నిలిచి పోయాయని విమర్శించారు. ● నాడు అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, భీమా ప్రాజెక్టు ద్వారా 100 టీఎంసీలు, తుంగభద్ర హైలెవల్ కెనాల్ ద్వారా 19 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవడానికి మూడు ప్రాజెక్టులు మంజూరు చేయాల్సి ఉండగా నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి రద్దు చేశారని, అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌దే ఈ నిర్వాహకమని ఆరోపించారు. వీటన్నింటికి బాధ్యత వహించాల్సింది సీఎం రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. ఇవన్నీ పక్కకు పెట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని తగిన విధంగా జవాబు చెబుతామని వెల్లడించారు.

TG

(c) eenadu

గుంత తవ్వి.. మరమ్మతులు మరిచి

పట్టణంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో మంచినీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం అయిదు రోజుల క్రితం గుంత తవ్వి పనులు పూర్తి చేయలేదు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చాలని, అప్పటి వరకు బద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

పట్టు వీడకు.. ప్రమాదానికి చోటివ్వకు

మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఉదయం, సాయంత్రం బస్సులు సరిపడా లేకపోవడం, ఉన్నా అందులో నిల్చోవడానికి స్థలం దొరకకపోవడంతో ఫుట్‌బోర్డులపైనే ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పాలమూరు నగరంలో సోమవారం తీసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, నవాబ్‌పేట, కార్పొరేషన్**

సస్యరక్షణతో వేరుసెనగలో అధిక దిగుబడి



కొన్నూరులో సాగైన వేరుసెనగ

మదనాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంట కింద యాసంగిలో వేరుసెనగ సాగు చేస్తారు. కలుపు, చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694, గిర్‌నారు-3 గిర్‌నారు-4 అధిక దిగుబడికి అనువైన రకాలని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి నవంబరు మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. 22 సెం.మీ.× 10 సెం.మీ. దూరంలో ఎకరాకు 4.4 లక్షల మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

పోషకాల యాజమాన్యం: భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్పేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా చల్లాలి.

విత్తనశుద్ధి : టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని ఆపై ట్రైకోడర్మా 10 గ్రా., అనంతరం రైజోబియం 5 గ్రా. విత్తనం వేసే 2 గంటల ముందు కలిపి విత్తుకోవాలి.

కలుపు పద్ధతి.. : విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపు కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే నివారణకు క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ. లేదా ప్రోపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ. విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు. వెడల్పాకు, గడ్డిజాతి కలుపు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజిథఫైర్ 10 శాతం ఎకరాకు 300 మి.లీ లేదా ఇమాజామాక్స్+ఇమాజిథఫైర్ 40 గ్రాముల కలుపు మందు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు.. : రసం పీల్చు పురుగు నివారణకు ఫ్రిపోనిల్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ. వేప మందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోఫైరిఫాస్ 50 ఈసీ 1.5 మి.లీ. లేదా న్యూవులురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. టిక్కా ఆకుమచ్చ, కాండం కుళ్లు నివారణకు క్లోరోథానిల్ 2 గ్రా. లేదా హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్+ ట్రైప్లాక్సిస్ట్రెబిన్ ఒక గ్రాము మందును ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

ఆర్టీసీలో అవిశ్రాంత పోరాటం!

- ప్రయోజనాలు అందక ఏళ్లుగా నిరీక్షణ
- ఆర్థిక ఇబ్బందుల్లో అల్లాడుతున్న వైనం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు ఓ విషయంలో ఎప్పుడూ తప్పుబడుతుంటారు. ఏ కాస్త సమయం దొరికినా డిపోల వద్దకు చేరి ఆర్టీసీ బాగోగుల గురించి ఎందుకు చర్చిస్తుంటారని ప్రశ్నిస్తుంటారు. విశ్రాంత జీవితంలోనూ సంస్థ గురించి తపన పడే వారిప్పుడు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది (డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది) ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి నెలలు గడుస్తున్నా విశ్రాంత ప్రయోజనాలు అందడం లేదు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20 లక్షలకు పైబడే అందాల్సి ఉంది. ఈ డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయోనని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయం చుట్టూ రోజూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు.

ఉచిత పథకాల పుణ్యమా అంటూ..: ప్రభుత్వాలు ఉచిత పథకాలు అమలు చేస్తున్న కారణంగా బడ్జెట్ లేక ఆయా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసే తమకు సకాలంలో ప్రయోజనాలను ఇవ్వలేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్టీసీలోనే కాదూ ప్రతి శాఖలోనూ ఎదురవుతోందంటున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి మూడు నుంచి ఆరు మాసాల్లోగా రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేవి. ఆ తర్వాత ఈ గడువు ఏడాదికి పెరిగింది. కాలక్రమేణా ఇది రెండు నుంచి మూడేళ్లకు చేరడంతో ఆర్టీసీ విశాంత్ర ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సర్వీసు నిబంధనల ప్రకారం: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసే వారికి వారం ముందే ప్రయోజనాలు (పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్) ఖాతాల్లో జమ చేయాలి.

కుమార్తె పెళ్లికి అప్పు చేశా

2024 నవంబర్‌లో ఆర్టీసీ గద్వాల డిపోలో ఏడీసీ కంట్రోలర్‌గా ఉద్యోగ విరమణ చేశా. 20 మాసాలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. రూ.20 లక్షలకు పైగా నాకు రావాలి. చేతిలో డబ్బు లేకపోవడంతో అప్పు చేసి కుమార్తె పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆర్ఎం కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **- కె.సుధాకర్‌రెడ్డి, విశ్రాంత కంట్రోలర్, పుట్టపల్లి**

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు.. కనికరించాలి

మహబూబ్‌నగర్ డిపోలో ఐదు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశా. 2017, 2021 సంవత్సరాల పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ ఎరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేద్దామని భావిస్తే ఇంత వరకు ఆర్టీసీ నుంచి ప్రయోజనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులపై కక్ష సాధించకుండా వెంటనే ఇవ్వాలి. **- ఎస్.సుగుణమ్మ, విశ్రాంత కండక్టర్**

రూ. 20 లక్షల వరకు రావాలి

మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ చేశా. రూ.20 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పుడు అప్పుడంటూ ఎదురుచూడటం తప్ప ఇవ్వడం లేదు. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేశా. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నా. **- కె.శ్రీనివాసులు, విశ్రాంత డ్రైవర్**

సాగులో.. సమస్యలా?

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11-12 గంటల మధ్య చరవాణి నంబరు 99514 61694ను సంప్రదిస్తే సందేహాలు నివృత్తి చేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

రైతేరాజు

పశువుల పేడ ఎంత వాడాలి?

మీ కోసం

హన్వాడ, న్యూస్‌టుడే : ఎకరానికి పశువుల పేడ ఎంత వాడాలో చాలా మంది రైతులకు తెలియదు. రూ.వేలు ఖర్చు చేసి ట్రాక్టర్ల కొద్దీ పొలాల్లో వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఎలాంటి రసాయన మందులు చల్లని రైతులు ఎకరానికి 100 కిలోల జల్లెడ పట్టిన పశువుల ఎరువు వాడితే సరిపోతుంది. దీన్ని కల్చర్ మాదిరిగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పశువుల ఎరువును పెంటకుప్ప నుంచి తీసి ఏడు రోజుల పాటు ఆరబెట్టి జల్లెడ పట్టాలి. వానాకాలం, యాసంగిలో విత్తనాలు విత్తేటప్పుడు వేసుకుంటే సరిపోతుంది. దీంతో పాటు పొడిగా ఉండే ఘనజీవామృతాన్ని కలిపి విత్తుకోవచ్చు.

పురుగుల నివారణలో జిగురు అట్టల పాత్ర కీలకం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఉపయోగించి ఎరువుల వినియోగం తగ్గిస్తూ, పంటకు హాని చేసే కీటకాలు, కాయతొలిచే పురుగును అరికట్టవచ్చని కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

ఇలా చేయాలి.. : అన్ని రకాల పంటలకు ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక పురుగులను పసుపురంగు అట్టలు ఆకర్షిస్తాయి. ముఖ్యంగా కూరగాయల పంటల సాగులో వీటిని వినియోగించవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి. వివిధ రకాల పంటలకు ఆశించే ఎర్ర నల్లి, తెల్ల నల్లి, తామర పురుగు నివారణకు నీలి రంగు అట్టలు వాడవచ్చు. ఎకరానికి 20 -25 అమర్చుకోవాలి. తెలుపు రంగు జిగురు అట్టలను రసం పీల్చే పురుగులు, తామర పురుగు నివారణకు వాడవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి

లింగాకర్షక బుట్టలు : కాయ తొలుచు పురుగుల నివారణకు వీటిని వాడతారు. వీటి వల్ల మగ పురుగులు ఆకర్షితమై, సంతతి గణనీయంగా తగ్గుతుంది. వీటిని ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చడం వల్ల మగ పురుగులను ఆశించే సామర్థ్యం పెరుగుతుంది. ● పురుగుల ఉద్ధృతిని గమనించడానికి ఎకరానికి 4-5 బుట్టలు అమర్చుకోవాలి. 10-20 బుట్టలు అమర్చుకోవడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చు. 50-60 శాతం నివారణకు లేదా పరాగసంపర్కాన్ని నిరోధించడానికి ఎకరానికి 100-120 బుట్టలు అమర్చుకోవాలి. పంటల ఎత్తు పెరిగే కొద్ది వీటి ఎత్తు పెంచుకోవాలి.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- శివకుమార్, పెబ్బేరు**

✔ నారు నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు వేయాలి.

? కందిలో ఆకులపై పురుగులు గూడు పెడుతున్నాయి. వాటి ఎలా నివారించాలి? **- నిరంజన్ యాదవ్, చేగుంట**

✔ కందిలో ఆకుగూడు నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆకు గూడును అరికట్టవచ్చు.

? జొన్నలో మొవ్వ తొలుచు పురుగు ఆశించింది. నివారణ ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామాంజనేయులు, మమ్మాయిపల్లి**

✔ జొన్న శాఖీయ దశలో మొవ్వతొలుచు పురుగును గమనిస్తే 1.0 మి.లీ. సైపర్‌మెత్రిన్ ద్రావణానికి లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

(కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సమాధానాలిచ్చారు)

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్క్రబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు. డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర చేతిలో పల్లె ప్రగతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ సమాచారాన్నైనా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 'జీపీ ప్రొఫైల్' (జీపీఎస్ఏపీ) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సమగ్ర సమాచారాన్ని అభివృద్ధి పనులు, ప్రణాళికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేశారు. ఈ పోర్టల్‌లో పల్లెలకు సంబంధించిన పూర్తి వివరాలు చూడటానికి చరవాణి లేదా అంతర్జాలంలోని గూగుల్ క్రోమ్‌ను తెరిచి https://gpsap&prrd.telangana.gov.in/gpprofile లింక్‌ను ఓపెన్ చేయాలి.

జిల్లాల వారీగా పంచాయతీల వివరాలు

వనపర్తి	268
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూలు	460
నారాయణపేట	272
జోగులాంబ గద్వాల	255

వెబ్ పేజీలో సమగ్ర సమాచారం: పేజీని తెరిచిన వెంటనే జిల్లా, మండలం, పంచాయతీ కోడ్ నమోదు చేస్తే అందులో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి వివరాలతో పాటు పంచాయతీలో ఉన్న జనాభా (స్త్రీ, పురుషులు), గృహాల సంఖ్య పొందుపరిచారు. వీటితో పాటు సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ట్రాక్టర్ లభ్యత, పంచాయతీ అధీనంలో ఉన్న భవనాలు, స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధుల వినియోగం, తదితర అంశాలను వెబ్ పేజీలో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పీయూ వీసీ శ్రీనివాస్

క్రికెట్ ఆడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: అధ్యాపకులు, సిబ్బంది నిత్యం ఏదో ఒక క్రీడ ఆడుతూనే ఉండాలని, అప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక పీయూలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పలు క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ క్రీడా పోటీలు సోమవారం నుంచి గురువారం వరకు జరుగుతాయన్నారు. వీసీ, ఓఎస్డీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీసీ జట్టు 60 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పీడీ శ్రీనివాసులు, పలు విభాగాల అధ్యాపకులు నాగం కుమారస్వామి, రాజ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, అర్జున్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, గాలెన్న, సుస్మిత, చిన్నాదేవి, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రంగప్ప పాల్గొన్నారు.

316 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో సోమవారం 8 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన 4, దిగువన 4 యూనిట్లలో 316 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 21,324 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30కు తెరుస్తారు. స్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, ఉదయం 9 నుంచి 11 గంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7కు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

EENADU e Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ పేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం తొలిసారి పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం డీఎస్పీ మొగులయ్య పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బీసన్న(50), మల్దకల్ మండలానికి చెందిన తనగల గోకారి (29) గంజాయిని సరఫరా చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వారిని పట్టుకొని 5.057 కేజీల 10 ప్యాకెట్ల గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరు తమ భూముల్లో పంటల సాగుతో పాటు గంజాయి మొక్కలు పెంచి వాటిని ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలని భాజపా ధర్నా

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

కోడేరు, న్యూస్‌టుడే: యువకుణ్ని ఠాణాకు పిలిపించి ఎస్సైతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు కోడేరు ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసేవరకు వెళ్లాయి. బాధితుడితో పాటు భాజపా నేతలు, గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించడంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం. . మండలంలోని ఠాకూర్‌తండాకు చెందిన డా.పరమేశ్వర్, నార్యానాయక్‌తండాకు చెందిన పాండునాయక్ వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో విమర్శలు చేసుకున్నారు. దీంతో పాండునాయక్ కోడేరు ఠాణాలో పరమేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. పరమేశ్వర్‌ను ఆగస్టు 28న విచారణకు ఠాణాకు పిలిపించి ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు కొట్టారు. గాయపడిన బాధితుడు తండా ప్రజలు, భాజపా నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావుకు మొరపెట్టుకున్నారు. అంతకు ముందే డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం భాజపా నాయకులతో ఠాణాకు పాదయాత్రగా వెళ్లారు. కొల్లాపూర్ సీఐ శంకర్, ఎస్సై, సిబ్బందితో వారిని అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ కోరగా ఎస్సై వేణుగోపాల్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయన్నారు. తాజా ఆరోపణలతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ శంకర్.. కోడేరు ఠాణా బాధ్యతలు చూస్తారని, త్వరలోనే మరో ఎస్సైని నియమిస్తామన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం

దస్త్రాలు పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, ఎస్పీ జానకి

భూత్పూర్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం సూచించారు. భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఠాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. వివిధ ఠాణాల దస్త్రాలు పరిశీలించి నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి

సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ జయలక్ష్మి

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సమష్టి కృషి అవసరమని, లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ డా.జయలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణ నివారణ (పీపీటీసీటీ) సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ బాధితులు మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లోని ఏఆర్టీ సెంటర్‌కు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్యసేవలతో పాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు విభాగ అధికారి రాజు, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836

?: మక్తల్ మండలం రామసముద్రంలో రహదారి పక్కన ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్తు నియంత్రికకు కంచె ఏర్పాటు చేయాలి. - **తిరుపతయ్య, రామసముద్రం**
✔: సిబ్బందితో మాట్లాడి కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్, ఏఈ, మక్తల్**
?: మండలంలోని భగవాన్‌పల్లి గ్రామంలో పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు తొలగించాలి. నూతన ట్యాంకు నిర్మించాలి. - **రాజు, భగవాన్‌పల్లి**, ✔: నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - **రమేష్‌కుమార్, ఎంపీడీవో, మక్తల్**
?: మంథన్‌గోడ్‌లోని నాలుగో వార్డులో విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయించాలి. - **పాలకృష్ణయ్య, మంథన్‌గోడ్**, ✔: పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వీధిదీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం - **రాజేందర్‌గౌడ్, సర్పంచి, మంథన్‌గోడ్**, ?: కర్ని, ఖానాపూర్ గ్రామాల మధ్య గుంతలు పడిన రహదారికి మరమ్మతులు చేయాలి. - **లక్ష్మణ్‌గౌడ్, ముస్లాయిపల్లి**, ✔: పరిశీలించి గుంతలు పూడ్చివేసేలా చర్యలు తీసుకుంటాం.
- **అభిలాష్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, మక్తల్**
-న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం

రద్దీ ఎక్కువ.. బస్సులు తక్కువ

మక్తల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మక్తల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రావణ మాసం మూడో సోమవారం ఆడపడుచులు తల్లిగారింటికి వచ్చి ఇంటి దేవతకు పూజలు చేస్తారు. పెద్దఎత్తున మహిళలు రావడంతో బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. హైదరాబాద్-1 డిపోకు చెందిన బస్సులు సుమారు 50 టిప్పులు నిత్యం రాయచూర్- హైదరాబాద్‌కు మధ్య తిరుగుతుంటాయి. పేట, మక్తల్ వరకు 20 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. అయినా అవస్థలు తప్పడంలేదు. అదనపు బస్సులు నడిపించాలని గ్రామస్థులు, యువకులు కోరుతున్నారు.

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండల కేంద్రంలో బస్టాండు ఉన్నా బస్సులు రావు. ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే వివేకానంద చౌరస్తాకు నడుచుకుంటూ వెళ్లాల్సిందే.

శిథిలావస్థకు చేరుతోంది..: గ్రామంలో రూ.7 లక్షలతో ప్రయాణికుల ప్రాంగణం నిర్మించారు. ప్రారంభంలో బస్సులు బాగానే వచ్చేవి. అనంతరం రావడం బంద్ అయ్యాయి. వినియోగంలో లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతోంది.

కోయిలకొండలో ఎండలో ఇలా..

2 కి.మీ నడవాలి..: వివేకానంద కూడలిలో మాత్రమే బస్సులు ఆపుతున్నాయి. గ్రామస్థులు ఇక్కడికి రావాలంటే సుమారు 2 కిలో మీటర్ల నడవాలి. విద్యార్థులు, దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూడలిలో కనీసం కూర్చోవడానికి స్థలం లేదు. ఎండకు, వానకు అవస్థలు పడుతున్నారు.

పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

నారాయణపేట, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ ఛైర్మన్ సదాశివరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పేట మండలం కోటకొండలో గ్రామాఖ్య సంఘాల భవన నిర్మాణానికి సర్పంచి వెంకట్రాములు, గ్రామ పెద్దలతో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేయడంతోపాటు గ్రామాల అభివృద్ధిలో భాగంగా సమాఖ్య భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. బండగండ గ్రామంలోనూ సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. సర్పంచులు వెంకట్రాములు, రాంచందర్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటకొండలో భూమిపూజ చేస్తున్న సదాశివరెడ్డి

మాదాసి కుర్వల సమస్యల్ని మంత్రివర్గంతో చర్చిస్తా: వాకిటి

సంఘం నాయకులతో మాట్లాడుతున్న మంత్రి

ఊట్కూరు, న్యూస్‌టుడే: మాదాసి కుర్వ కులస్థుల సమస్యల్ని పరిష్కరించేందుకు మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తానని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నియోజకవర్గ మాదాసి కుర్వ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అంజప్ప ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలో సోమవారం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాదాసి కుర్వ సంఘం నాయకులు మాట్లాడుతూ మాదాసి కుర్వ కులస్థులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఎస్సీ కుల ధ్రువపత్రాలు జారీ చేయటంతో తమ పిల్లలకు న్యాయం జరుగుతుందన్నారు. గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించాలని, గొర్రెలను మేపేందుకు ప్రతి గ్రామంలో 5 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. గొర్రెలకాపరులకు బీమా, పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి మాట్లాడుతూ మాదాసి కుర్వల సమస్యల్ని సెప్టెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల మాదాసి కుర్వ సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

నోటీసులు అందితే ఆధారాలు సమర్పించండి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా ఆధారాలు సమర్పించి మళ్లీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని పుర ఛైర్‌పర్సన్ వాకిటి మాస, పుర కమిషనర్ రాజయ్య, తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు సరైన ఆధారాలు సమర్పించి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలంతా జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవాలని ముసాయిదా జాబితాలో పేర్లు లేనివారు తప్పనిసరిగా ఆధారాలు సమర్పించి తమ ఓటు హక్కు కాపాడుకోవాలన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటించండి

నారాయణపేట, న్యూస్‌టుడే: రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతు విజ్ఞాన కేంద్రం పేట సమన్వయకర్త డా.ఈటెల సత్యనారాయణ, ఏఆర్ఎస్ తాండూరు శాస్త్రవేత్తలు స్వాతి, మాణిక్య మిన్ని సూచించారు. నారాయణపేట మండలం పేరపళ్ల, శ్యాసన్‌పల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి, కంది పంటలను సోమవారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలో నీటి నిర్వహణ, నేల పరిస్థితులు, పంట ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు.

శ్యాసన్‌పల్లిలో వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

'వంద రోజులన్నారు.. వెయ్యి రోజులైనా చేయలే'

కోస్గిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి, న్యూస్‌టుడే: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ మోసపూరిత హామీలు ఇచ్చి వెయ్యి రోజులైనా పూర్తి చేయలేదని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కోస్గిలోని భారాస కార్యాలయంలో 'కొడంగల్ నియోజకవర్గం-సమర శంఖం' పేరిట నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సోదరులు బినామీల పేరుతో భూములు దండుకుంటున్నారని, పర్సంటేజీలు తీసుకుంటున్నారని ఆరోపించారు. వీరి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. అబద్ధాల హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, వారి మోసాలు, దౌర్జన్యాలు ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు ఈ నెల 2 నుంచి 8 వరకు నిరసనలు చేపడుతున్నామన్నారు. 2న నియోజకవర్గంలోని అన్ని పురపాలికలు, మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో ర్యాలీలు, ధర్నాలు చేస్తామన్నారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసిన తీరు ఎండగడతామన్నారు. 3న రైతు సమస్యలు, రీజనల్ రోడ్డు, కారిడార్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటున్నారన్నారు. కోస్గి, కొడంగల్, మద్దూరుల్లో 22ఏ పేరుతో రైతుల భూములు చేర్చారని విమర్శించారు. రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వడంలేదని, కాంగ్రెస్ నాయకులకు మాత్రం అదనపు భూములకు నష్టపరిహారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని కోస్గిలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, దీనికి మాజీ మంత్రులు సబిత, శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతారన్నారు. 4న మద్దూరులో మహిళల సమస్యలపై వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5న వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నిరసన ఉంటుందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్‌పై రేవంత్‌రెడ్డిని నిలదీస్తామన్నారు. 6న బొంరాస్‌పేటలో పచ్చదనంపై ఆందోళన చేపడతామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పల్లెపల్లెన నర్సరీలు ఏర్పాటు చేసి వనాలను సృష్టిస్తే ఇప్పుడు ఆ చెట్లన్నింటినీ ఎండబెట్టారన్నారు. 7న ప్రతి మండలంలో ప్రజావాణి కార్యక్రమంలో వెయ్యి ఫిర్యాదులు చేస్తామన్నారు. 8న అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. భారాస నాయకులు వెంకటనర్సిములు, శాసం రామకృష్ణ, కోట్ల మహిపాల్, సాయిలు, జనార్దన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, దినేష్, నర్సిములు, అంజయ్య, మధుసూదన్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఊట్కూరు, న్యూస్‌టుడే: ఊట్కూరు మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ సోమవారం నేపథ్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బీరప్ప దేవాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. జనవరి 2026 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు హుండీని లెక్కించగా రూ.8,80,186 ఉన్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.నిత్యానందచారి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రాణేషాచారి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు ఎస్.శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

కొత్తకాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

కృష్ణా, న్యూస్‌టుడే: మాగనూరు మండల కేంద్రంలోని కొత్తకాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 1988లో 200 పైచిలుకు ఇళ్లకు పట్టాలిచ్చారు. అప్పటి నుంచి నేటి వరకు కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని, పాముకాటుకు గురై ఒక మహిళ మృతి చెందిందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు పుంజనూరు ఆంజనేయులు, పాటిమీది వెంకటయ్య, టప్ప రమేష్, పుంజనూరు మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం.. అటకెక్కిన నిర్వహణ

గత ప్రభుత్వం పల్లె ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గ్రామానికో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పల్లెలో గల పల్లెప్రకృతి వనాల నిర్వహణ లేక గ్రామాల ప్రజలు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. సంబంధిత అధికారులు ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలు తొలగించి నిర్వహణ గాడిన పెడితే గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్న అభిప్రాయం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.
-న్యూస్‌టుడే, కోస్గి న్యూటౌన్

అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు..

నారాయణపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కలెక్టర్ ప్రియాంక అన్నారు. సోమవారం పేటలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో రమేష్ తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 40 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. పరిపాలన వ్యవస్థలో వచ్చిన అనేక మార్పులకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచారని, విధులను సమర్థవంతంగా నిర్వర్తించారని కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏవో అనిల్‌కుమార్, డీపీఆర్వో రషీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే డబ్బు వినియోగం, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ ప్రియాంక అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 'స్వతః ఫౌండేషన్' సౌజన్యంతో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆర్థిక అక్షరాస్యత, మనీ మంత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 88 ప్రాథమికోన్నత పాఠశాలలు ఎంపిక చేయడం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు గొప్ప అవకాశమన్నారు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో సక్రమంగా పొదుపు చేయడం, సరైన విధంగా పెట్టుబడి పెట్టడం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకోవడం అంతకంటే ముఖ్యమన్నారు.

సూపరింటెండెంట్ అఖిల ప్రసన్నను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్, డీఆర్వో

● **నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే:** బాలికల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ ప్రియాంక అన్నారు. బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) నిధుల ద్వారా జిల్లాలో ఎంపిక చేసిన 83 పాఠశాలలకు సోమవారం శానిటరీ న్యాప్కిన్ ఇన్సినరేటర్లను పంపిణీ చేశారు.

నారాయణపేట, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జీవితంలో విజయం సాధించాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేంత వరకు నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ఇటీవల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో బాలికలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. డీడబ్ల్యూవో రాజేందర్‌గౌడ్, డీవైఎస్‌వో వెంకటేశ్ పాల్గొన్నారు.

క్వారీలు, క్రషర్ల పనులు ఆపాలని రైతుల ఆందోళన

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుడిగండ్ల గుట్టకు క్వారీలు, క్రషర్ల ఏర్పాటు పనులు ఆపాలని కోరుతూ సోమవారం రైతులు, గ్రామ యువకులు, పుడమి ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో పనుల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్‌మాల రహదారి నిర్మాణం కోసం గుత్తేదారు గుడిగండ్ల గుట్టకు సర్వే నెం. 244లో ఉన్న 31.18 ఎకరాల గుట్టకు బ్లాస్టింగ్ చేయాలని ఏర్పాట్లు చేసుకున్నారు. దీని కోసం పక్క పొలాల్లో గుంతలు తీస్తున్నారు. గుట్టపై 40 గ్రామాలకు నీటిని అదించే మిషన్ భగీరథ ట్యాంకు, పురాతన చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. సమీపంలో పంట పొలాలు, పక్కనే మహబూబ్‌నగర్, రాయచూరు జాతీయ రహదారి, పులిమామిడి రైల్వేస్టేషన్ ఉన్నాయి. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కంకర యంత్రం ఏర్పాటు చేయడంతో పంటలు దెబ్బతినడంతోపాటు వాతావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భరత్ కుమార్, సీఏ అంజి, రుకేష్, కావాలి రఘు, వెంకటేశ్, పార్వతి, భాస్కర్, రామాంజనేయులు, విజయ్, అనిల్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ గ్రామ పంచాయతీ అద్దె దుకాణాల విషయంలో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల భాజపా నాయకులు సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. గత 25 ఏళ్లుగా అద్దె దుకాణాలు రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో ఉండగా ఇటీవల వీటికి విముక్తి లభించిందని ప్రస్తుతం అద్దెల రూపంలో పంచాయతీకి ఆదాయం సమకూరుతున్న తరుణంలోనే ఓ దుకాణదారుడు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సొంత స్థలమంటూ అధికారులను తప్పుదోవ పట్టిస్తుండటంపై వినతిలో ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కోర్టుకు వెళ్లాడని, ఈ తరుణంలో దుకాణాన్ని తెరవడంపై విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ దుకాణాన్ని స్వాధీనం చేసుకొని వేలం వేయాలని, లేదంటే మిగతా దుకాణాలపై ప్రభావం పడి ఆదాయానికి గండిపడే అవకాశం ఉందన్నారు. నాయకులు మంగలి వేణుగోపాల్, రాజేష్‌యాదవ్ తదితరులు వినతి అందజేసిన వారిలో ఉన్నారు. ఈ విషయంపై ఎలిగేండ్లకు చెందిన అనిల్‌కుమార్ మరో వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

పేటలో ఆసుపత్రిని ప్రారంభించిన కేంద్ర మంత్రి

నారాయణపేట, న్యూస్‌టుడే: పేట జిల్లా కేంద్రంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్‌పాండురెడ్డి నిర్మించిన ప్రైవేటు ఆసుపత్రిని సోమవారం ఎంపీ డీకే అరుణతో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డా.వినీత్, పుర ఛైర్‌పర్సన్ కొండా శ్వేత, వైస్‌ఛైర్‌పర్సన్ మంజుల, భాజపా జిల్లా అధ్యక్షుడు కొండా సత్యయాదవ్, పార్టీ వివిధ నియోజకవర్గాల నేతలు పవన్‌కుమార్‌రెడ్డి, భరత్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగురావు నామాజీ హాజరయ్యారు. అంతకు ముందు కలెక్టర్ ప్రియాంక మర్యాదపూర్వకంగా మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పి.శ్రీనివాసులు, కొండయ్య, లక్ష్మీశ్యాంసుందర్, కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

పొలాల్లో మట్టి వేయడం తగదు

దామరగిద్ద, న్యూస్‌టుడే: ఎంఎన్‌కేఎల్ పథకంలో భాగంగా ప్రాజెక్టుకు సేకరించిన భూమికంటే అదనంగా సాగు భూముల్లో మట్టివేసి రైతులను నష్టపరుస్తున్నారని సీపీఎం నాయకులు గోపాల్ అంజిలయ్య తదితరులు ఆరోపించారు. రైతులకు తెలియకుండా మట్టి వేసి రైతులను నష్టపరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురాగా గుత్తేదారుతో మాట్లాడి రైతుల పొలాల్లో మట్టివేయకుండా పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివకుమార్, అరుణ్, హన్మంతు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి అన్నారు. సోమవారం మండలంలోని భూత్పూర్ జలాశయం ఎడమ కాలువ పూడికతీత పనులు ప్రారంభించి మాట్లాడారు. గత కొంతకాలంగా కాల్వలో పెరిగిన జమ్ము, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో సాగు నీరందటం లేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నర్వ మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వేద గణితంలో ప్రతిభ

ఊట్కూరు, న్యూస్‌టుడే: ఊట్కూరులోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు భైంసాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వేద గణితం విభాగంలో బాలవర్గ జట్టు ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం విశాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కె.భాస్కర్, భవిత, రాకేష్‌లను అభినందించారు. వేద గణితం విభాగంలో తమ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబర్చడం అభినందనీయమని పాఠశాల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో జల్ది బిందోత్సవం

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకొని జల్దిబిందోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన జల్దిబిందె ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు శివ బాపనయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నరసింహాస్వామి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ధన్వాడ, న్యూస్‌టుడే: శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకొని మండల కేంద్రమైన ధన్వాడలో భక్తులు నరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించారు. కుర్వవాడలోని ఆలయం వద్ద భక్తులు ఉపవాస దీక్షతో ఆలయం వద్దే నైవేద్యం తయారు చేసి సమర్పించారు. మందిపల్లి, రాంకిష్టాయపల్లి, కిష్టాపూర్, గోటూర్ తదితర గ్రామాల్లోనూ ఉత్సవాలు కొనసాగాయి.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

మద్దూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, తెలంగాణ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దోరేపల్లిలో నాయకులు గోడపత్రికలు విడుదల చేశారు. మహబూబ్‌నగర్ నగరంలో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించే మహాసభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని సంఘం జిల్లా నాయకులు కె.రాములు, హన్మప్పలు కోరారు.

దోరేపల్లిలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

పోలీసు సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయండి

నారాయణపేట, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గం పోలీసుల సంక్షేమానికి కృషి చేయాలని ఎస్పీ డా.వినీత్ అన్నారు. పోలీసు అధికారుల సంఘం కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ గత నెల 25న నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, ఉపాధ్యక్షుడిగా పేట సీఐ శివశంకర్ ఎన్నికయ్యారు. కార్యదర్శి పేట ఎస్సై వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ హెచ్‌సీ, కోశాధికారి కానిస్టేబుల్ రాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా హెడ్‌కానిస్టేబుల్ శ్రీదేవి, కానిస్టేబుల్స్ యాదయ్య, పరంధాములు, శ్రీనివాసులు, రమేష్, మహేశ్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా స్థానిక కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎస్పీతోపాటు ఏఎస్పీ రియాజ్‌హుల్ హక్, డీఎస్పీ మహేశ్‌లు అభినందించారు.

జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్, కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎస్పీ డా.వినీత్

వైస్ ఛైర్‌పర్సన్ శైవీరెడ్డి దాతృత్వం

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: మక్తల్ పురపాలిక వైస్ ఛైర్‌పర్సన్ శైవీరెడ్డి తన దాతృత్వం, ఉదారత్వాన్ని చాటుకున్నారు. తన నాలుగు నెలల వేతనాన్ని పేద మహిళ, ఇతర అభివృద్ధి పనులకు విరాళం అందించారు. ఏళ్ల నుంచి చెప్పులు కుట్టి జీవనం సాగిస్తున్న సీతమ్మకు రూ.7 వేలు, ఎంపీపీఎస్ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.12 వేలు, ఊట్కూరు మండలం పులిమామిడి రామలింగేశ్వర ఆలయం వద్ద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.10 వేలు విరాళం అందించారు. సమాజం, ప్రజలకు ఉపయోగపడేలా తన వేతనం డబ్బులు ఇవ్వడం పట్ల పలువురు పట్టణవాసులు శైవీరెడ్డిని అభినందించారు.

కుల వివక్షతకు దూరంగా ఉందాం

ధన్వాడ, న్యూస్‌టుడే: కుల వివక్షతకు దూరంగా ఉందామని ధన్వాడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిఖిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ధన్వాడలోని గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. జీపీవో భాస్కర్, పి.రాంచంద్రయ్య, రఘువీర్ యాదవ్, రాఘవరెడ్డి, పోలీసు శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

గాయపడిన వృద్ధుడి మృతి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం రివర్స్ తీసుకుంటూ బస్సు ఢీకొన్న సంఘటనలో గాయపడిన కొల్లంపల్లి మల్లారెడ్డి(65) చికిత్స పొందుతూ మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం మృతి చెందారు. ఈయన భార్యతో కలిసి మరికల్ బస్టాండ్‌లో ఉండగా రాయచూర్ వెళ్తున్న బస్సు రివర్స్ తీసుకుంటూ వెనుక ఉన్న మల్లారెడ్డిని ఢీకొట్టిన విషయం తెలిసిందే. కాలుకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మరికల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయంలో హుండీ చోరీ

కృష్ణా, న్యూస్‌టుడే: కృష్ణా మండలం కుసుమర్తి గ్రామ శివారులోని కాలహళ్లి ఆంజనేయ స్వామి దేవాలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం రాత్రి ఆలయం వద్ద భజనలు చేసినప్పుడు హుండీ బాగానే ఉందని సోమవారం రాత్రి ఆలయం వద్దకు వెళ్లి చూసే సరికి హుండీ పగులగొట్టినట్లు గుర్తించామని వారు చెప్పారు. కృష్ణా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దామరగిద్ద, న్యూస్‌టుడే: దామరగిద్దలోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి శ్రావన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu